

19 వ వసంతంలోకి ...

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఏలూరు జిల్లా
పశ్చిమ గోదావరి జిల్లా

బుధవారం,14 జనవరి 2026

8 పేజీలు


## పందెం పుంజు...

# రూ.5లక్షలు పైనే..!

- 6 నెలలు పెంచి ప్రత్యేక శిక్షణ -పెద్ద పందాలులో రంగును బట్టి పందెం
-ఉమ్మడి పశ్చిమ గోదావరిలో క్యాజాకు యమ డిమాండ్





**ఏలూరు,సూర్యప్రతినిధి:**సంక్రాంతి పండుగసందర్భంగా గోదారితీరాన కోడికూసింది.ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఎక్కడికక్కడ బరులు వెలిసాయి. పందెం పుంజు ధర ఈసారి లక్షలకు పాకింది. సరాసగా ఒక్కో పుంజు 4 లక్షల నుంచి 6లక్షల ధర పలికింది. సుమారు 6నెలలపైగా పందెం పుంజులకు ప్రత్యేకంగా పుడ్డు ఏర్పాటు చేస్తారు. బాదం, జీడిపప్పు ఇలా ఒకటేంటి పందెం పుంజు సిద్ధమయ్యేందుకు సరఫడ అన్ని హంగులు సమకూరుస్తారు. రోజుకి రెండు పూటలా వాటి సామర్థ్యం పెంచేలా ప్రత్యేక కొలనులో ఈత కొట్టిస్తారు. అంతకంటే మించి పందెం కోళ్ళలో అలసట రాకుండా ఎప్పటికప్పుడు చేస్తారు. వేడినీరుతో ఆవిరి పెట్టి రెక్కల కింద, తొడల మీద కాస్తారు. ఇప్పటికే అధికార పక్షం చెందిన అనేకమంది పెద్ద సంఖ్యలో పందెంకోడిలను పెంచి, అమ్మకాలు చేస్తున్నారు. ఒకరకంగా చెప్పాలంటే ఆరు నెలలుగా వీటిని పెంచి పోషించి వాటి పందెం సామర్థ్యాన్ని పెంచి దీనికి తోడు పందెం పుంజు రంగును బట్టి పందాలు జరుగుతాయి కాబట్టి దీనికి అనుకూలంగానే కోళ్లను బరులకు సిద్ధం చేశారు. గత ఏడాది జంగారెడ్డిగూడెం సమీపన శ్రీనివాసపురంలో పెద్ద ఎత్తున పందాలు సాగాయి. దెందులూరు నియోజకవర్గ ప్రాంతంలో మూడు లక్షల నుంచి పది లక్షల వరకు పందాలు

- తరువాయి 2లో..

## భారత జనగణనకు

# జిల్లాలో సన్నాహక చర్యలు

- కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలు మేరకు అధికారులు నియామకం





**న్యూఢిల్లీ/ఏలూరు,మేజర్‌న్యూస్ :** భారత జనగణన – 2027 నిర్వహణకు సంబంధించి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు జారీచేసిన మార్గదర్శకాలను అనుసరించి జిల్లాలో అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి తెలిపారు. మంగళవారం న్యూ ఢిల్లీ నుంచి వీడియోకాన్ఫరెన్స్‌ద్వారా నిర్వహించిన సమీక్షా సమావేశంలో కేంద్ర ప్రభుత్వ డైరెక్టరు ఆఫ్ సెన్సెస్‌జె.నివాస్ పాల్గొనగా, అమరావతి నుంచి సర్వీసెస్ ప్రత్యేక చీఫ్ కార్యదర్శి ఎస్.కె.రావత్ పాల్గొని జిల్లా కలెక్టర్లుకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జనగణన–2027కు జిల్లాలో అధికార యంత్రాంగం సిద్ధం చెయ్యడం జరుగుతుంది అని తెలియ చేశారు. పట్టణ ప్రాంతాల్లో ఛార్జ్‌సెన్సస్ ఆఫీసర్లుగా మున్సిపల్ కమిషనర్లను, గ్రామీణ ప్రాంతాల్లో తహాశీల్దార్లను నియమించనున్నట్లు వివరించారు.జిల్లా, ఉప విభాగ, మండల, పట్టణ స్థాయిల్లో సెన్సస్ అధికారులుగా వివిధ శాఖల అధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని జిల్లా కలెక్టరు పేర్కొన్నారు.పోలవరంసంబంధించినకొన్ని గ్రామాలు, ఆర్అండ్ఆర్ కాలనీలో ఉన్న ఇబ్బందులను గైడ్లెన్స్ ప్రకారం ప్లాన్‌చేసుకుని జనాభా లెక్కలు మొదటివిడత కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వారిలో జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ,జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు, సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న,ఆర్డీవోలు యం.అచ్యుత అంబరీష్, యం.వి. రమణ, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్లు, సంబంధిత అధికారులు వారివారి కార్యాలయంలు నుండి హాజరయ్యారు.

# సంక్రాంతి పండుగ ఆటవిడుపు

- తొలిసారిగా భీమవరంలో పారామోటార్ ఏరియల్ అడ్వెంచర్ ప్రారంభం





**కాళ్ళ,మేజర్‌న్యూస్ :** భీమవరంలో ఎన్నడూ లేని విధంగాసాంప్రదాయ పోటీలతోపాటు పారామోటర్ ఏరియల్ అడ్వెంచర్ స్కై రైడ్‌ను కూడా తీసుకు రావడం జరిగిందని, పట్టణ ప్రజలు, సంక్రాంతికి పట్నానికి వచ్చినప్రజలుసద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర శాసనసభ ఉప సభాపతి రఘురామ కృష్ణంరాజు తెలిపారు. మంగళవారం జువ్వలపాలెం రోడ్డు పెద్దఅమీరం మిత్ర హాస్పిటల్ ఎదురుగా ఖాళీ మైదానంలోఏపీ అడ్వెంచర్స్ ప్రమోటర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పారా మోటర్ ఎరైవల్ అడ్వెంచర్ స్కై రైడ్‌ను రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామకృష్ణంరాజు ప్రారంభించారు.ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ

- తరువాయి 2లో..

## కోడి కత్తుల తయారీ కేంద్రంపై దాడి : ఒకరి అరెస్టు



- తరువాయి 2లో..

**గణపవరం,మేజర్‌న్యూస్:** గణపవరం మండలం చిన్న రామచంద్రపురం గ్రామంలో కోడి కత్తుల తయారీ కేంద్రంపై దాడులు చేసి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుండి 300 సాన బెట్టిన పదునైన కోడి కత్తులు, కోడి కత్తు లకు సంబందించి 200 చిన్న చిన్న ముక్కలు,16 హెచ్ పి ఎలక్ట్రికల్ గ్రైండ్ మోటార్ స్వాధీ న పరుచుకున్న గణపవరం పోలీస్ సిబ్బంది.జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిశోర్, ఆదేశాలపై, డిఎస్పీ డి.శ్రావణ్ కుమార్ పర్య వేక్షణలో నిడమర్రు సిఐ యన్ రజిని కుమార్,గణపవరం పోలీస్ స్టేషన్ ఎస్.ఐ.ఏ.మణి కుమార్, వారి సిబ్బంది కలిసి కోడి కత్తులు తయారు చేయుచున్న వ్యక్తిని అదుపులోనికి తీసుకున్నారు.ముద్దాయి మూసినాని శివాజీ,చిన రామచంద్రపురం

- తరువాయి 2లో..

## ఇంజనీర్లే ఇన్వెస్టర్లు..

# కాంట్రాక్టర్లే బినామీలు

### ఉభయ గోదావరి ఆర్&బిలో కోట్ల 'సిండికేట్' దందా!

- జీవోల ముసుగులో మెగా స్కామ్..లీడ్ మాయాజాలంతో ప్రజాధనం లూటీ..
- అధికారుల ముసుగులో కోట్లకు పడగలెత్తిన నల్ల కుబేరులు!
- కాంట్రాక్టర్లకు అమ్ముడుపోతున్న సూపరింటెండెంట్ ఇంజనీర్లుగా ప్రజల భావన
- హాట్ ప్లాంట్ సిండికేట్.. చిన్న కాంట్రాక్టర్లు గొంతు కోస్తున్న బడా కోటరీ
- చాలా పెద్ద ప్రమాదంలో అవినీతి ఇంజనీర్లు..!



ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి కేటాయించే వేల కోట్ల ప్రజాధనం ఉభయ గోదావరి జిల్లాల్లోని ఆర్&బి శాఖలో అధికారుల అక్రమ సంపాదనకు మార్గంగా మారింది. ఇక్కడ కొందరు ఇంజనీర్లు దశాబ్ద కాలంగా ఒకే ప్రాంతంలో తిష్టవేసి, నిబంధనలకు విరుద్ధంగా తమ నల్లధనాన్ని కాంట్రాక్టర్ల పనుల్లోనే పెట్టుబడిగా పెడుతూ 'నల్ల కుబేరులు'గా అవతరించారు ఎస్టి మేషన్ల తయారీలో లీడ్ ఛార్జీల మాయాజాలం నుండి, 100/120 హాట్ ప్లాంట్ మిక్సర్ల ముసుగులో చిన్న కాంట్రాక్టర్లను అడ్డుకోవడం వరకు అంతా ఒకపకడ్బందీ 'కోటరీ'గా సాగుతోంది. రాజకీయ అండదండలతో తక్కువ రేటుకు టెండర్లు వేసే వారిని బెదిరిస్తూ, అధిక ధరలకే పనులు దక్కించుకుంటున్న ఈ వ్యవస్థలో ఏజీ ఆడిట్ మరియు ఏపీ ఫైనాన్స్ కోడ్ సెక్షన్ 151 వంటి జవాబుదారీతనం పూర్తిగాకనుమరుగైంది. కంచెలాగా ఉండి అభివృద్ధిని పర్యవేక్షించాల్సిన అధికారులే బినామీల పేర్లతో ఆస్తులు కూడబెడుతూ, వ్యవస్థను వేళ్ళతో సహా పెకిలించి వేస్తున్న ఈ భారీ కుంభకోణంపై తక్షణమే ఏసీబీ దర్యాప్తు జరగాల్సిన అవసరంఉంది.

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :

మిగతా 2 లో..

# ఇంజనీర్లే ఇన్వెస్టర్లు.. కాంట్రాక్టర్లే బినామీలు





**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**
రహదారులు అభివృద్ధి చెందితేనే ప్రాంతం ప్రగతి పథంలో పయనిస్తుంది .కానీ ఉమ్మడి తూర్పు మరియు పశ్చిమగోదావరి జిల్లాలలో రహదారులు భవనాల శాఖ మాత్రమే అవినీతి నిలయంగా మారింది. ఈ రెండు జిల్లాల్లోని కొందరు ఇంజనీర్లు బడా కాంట్రాక్టర్లతో చేతులు కలిపి ఒక అజేయమైన కోటరిగా ఏర్పడ్డారు. ఇక్కడ రోడ్లు వేయడం అంటే ప్రజల సౌకర్యం కోసం కాదు అధికారుల నల్లధనాన్ని రీసైక్లింగ్ చేయడం కోసమే అన్నట్లుగా పరిస్థితి తయారైంది.

**ఏజీ ఆడిట్ వ్యవస్థకు 'చరమగీతం':**
**నిబంధనల ఉల్లంఘన కాదు.. రాజ్యాంగబద్ధ వ్యవస్థపై దాడి!**
రెండు జిల్లాల్లోనూ ఏజీ ఆడిట్ వ్యవస్థను అధికారులు చుట్టపుచూపుగా మార్చేశారు. ఇది కేవలం పొరపాటు కాదు, పక్కాగా స్కెచ్ వేసి చేస్తున్న వ్యవస్థాగత దోపిడీ.

– ఏపీ ఫైనాన్షియల్ కోడ్ సెక్షన్ 151 సమాధి: ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కోడ్ వాల్యూమ్–1 లోని సెక్షన్ 151 ప్రకారం.. ప్రతి అధికారి ప్రజాధనం విషయంలో తన సొంత డబ్బు లాగే బాధ్యత వహించాలి. కానీ ఇక్కడ 'సూపర్ విజన్' పేరుతో ఏఈ నుండి ఎస్ఈ వరకు అంతా కమీషన్ల పంపకాల్లో బిజీగా ఉన్నారు. క్షేత్రస్థాయిలో నాణ్యతను తనిఖీ చేయాల్సిన అధికారులు, ఏసీ గదుల్లో కూర్చుని కాంట్రాక్టర్లు రాసిచ్చిన రీకార్డింగ్ లను 'ఎం–బుక్'లో ఎక్కించడం రాజ్యాంగ విరుద్ధం.

– బిఎన్ఎస్ సెక్షన్ 316 / ఐపిసి 409 కింద నేరం: ప్రజాధనాన్ని రక్షించాల్సిన బాధ్యత కలిగిన పబ్లిక్ సర్వెంట్, ఆ ధనాన్ని దుర్వినియోగం చేయడం లేదా కాంట్రాక్టర్లకు మేలు చేసేలా తప్పుడు రికార్డులు సృష్టించడం "క్రిమినల్ బ్రీచ్ ఆఫ్ ట్రస్టు" కిందకు వస్తుంది. పనులు జరగకుండానే బిల్లులు చెల్లించడం, తప్పుడు వోచర్లు సృష్టించడం ఏడేళ్ల నుండి జీవిత ఖైదు పడే నేరమని అధికారులు మర్చిపోయారు.

– ఏజీ ఆడిట్ అపహాస్యం: భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 149–151 ప్రకారం మరియు కాగ్ డిపిసి చట్టం 1971 నిబంధనల ప్రకారం జరగాల్సిన ఏజీ ఆడిట్‌ను అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారు. పాత మెటీరియల్‌నే కొత్తగా చూపిస్తూ, 'రీ–సైక్లింగ్' బిల్లులు సృష్టించి, ఆడిట్ అబ్జెక్షన్లు రాకుండా అధికారులను మేనేజ్ చేసే స్థాయికి ఈ అవినీతి సామ్రాజ్యం విస్తరించింది. లోకల్ ఫండ్ ఆడిట్ మరియు ఇంటర్నల్ ఆడిట్ విభాగాలను డమ్మీలుగా మార్చేసి, వేల కోట్ల దోపిడీకి గేట్లు తెరిచారు.

అంచెలంచెలుగా 'అవినీతి' సోపానపటం: ఎస్టిమేషన్ల మాయ
ఈ రెండు జిల్లాల్లోనూ అవినీతికి పునాది ఒకేలా పడుతోంది.

– లీడ్ కుంభకోణం: మెటీరియల్ సమీపంలోనే ఉన్నా, సుదూర ప్రాంతాల నుండి రవాణా చేస్తున్నట్లు తప్పుడు లెక్కలు రాసి కోట్లాది రూపాయల 'లీడ్ల ఛార్జీలను కాజేస్తున్నారు.

– గ్రౌండ్ లెవల్ ఎస్టిమేషన్లు: కాంట్రాక్టర్ల ఆఫీసుల్లో కూర్చుని ఇంజనీర్లు ఎస్టిమేషన్లు తయారు చేస్తున్నారు. పశ్చిమ గోదావరిలో కూడా ఇష్టానుసారంగా క్వాంటిటీలను చూపిస్తూ ప్రభుత్వ ఖజానాను లూటీ చేస్తున్నారు.

**హాట్ ప్లాంట్ 'ముసుగు' – చిన్న కాంట్రాక్టర్ల పట్ల కనికరం లేదు**
ఉమ్మడి గోదావరి జిల్లాల్లో రహదారి పనులు దక్కాలంటే 100/120 హెచ్‌ఎంపి సామర్థ్యం కలిగిన బ్యాచ్ టైప్ హాట్ మిక్చర్ ప్లాంట్ ఉండాలనే నిబంధన ఒక శాపంగా మారింది.

– నిబంధన వెనుక కుట్ర: 19–06–2017 నాటి జివో ఆర్‌టి నెం 180 టిఆర్ & బిఆర్ 1 ప్రకారం, పని జరిగే ప్రాంతం నుండి 100 కి.మీ. పరిధిలో సొంత లేదా లీజు ప్లాంట్ ఉండాలి. టెండర్ దారుడు దీనికి సంబంధించి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ధృవీకరించిన సర్టిఫికేట్‌ను అప్‌లోడ్ చేయాలి.

– కోటరీ గుత్తాధిపత్యం: ఈ ప్లాంట్లు కేవలం కొందరు బడా కాంట్రాక్టర్ల వద్దే ఉండటంతో, వారు సిండికేట్‌గా మారి పనులను 'ఎక్సెస్ రేట్ల కు దక్కించుకుంటున్నారు. చిన్న కాంట్రాక్టర్లు టెండర్లు వేయకుండా లీజు ఒప్పందాలను అడ్డుకుంటూ రాజకీయ బెదిరింపులకు పాల్పడుతున్నారు.

**ఇంజనీర్లే ఇన్వెస్టర్లు – నల్ల కుబేరులుగా మారిన అధికారులు**
ఈ రెండు జిల్లాల్లో కొందరు ఇంజనీర్లు తమ హోదాను అడ్డం పెట్టుకుని కోట్లాది రూపాయలు గడించారు.

– నల్లధనం రీసైక్లింగ్: అవినీతి ద్వారా సంపాదించిన డబ్బును నేరుగా కాంట్రాక్టర్ల పనుల్లోనే పెట్టుబడిగా పెడుతున్నారు. కాంట్రాక్టర్లతో బహిరంగంగా చట్టపట్టాలు వేసుకొని తిరుగుతున్న వీరు 'సైలెంట్ పార్టనర్స్'గా మారి పర్యవేక్షణను గాలికి వదిలేశారు. దీనివల్ల పనుల్లో నాణ్యత పూర్తిగా లోపించింది.

– ఆస్తుల కూడబెట్టడం: రాజమండ్రి, కాకినాడ, తుని, ప్రత్తిపాడు, ఏలూరు, భీమవరం, తణుకు మరియు విజయవాడ హైదరాబాద్‌లో బినామీల పేర్లతో ఖాళీ స్థలాలు, పొలాలు, అపార్ట్‌మెంట్లు, విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్సులు నిర్మిస్తూ నల్లధనాన్ని భద్రపరుస్తున్నారు.

**బదిలీల ఉల్లంఘన: దశాబ్దాలుగా ఒకే చోట 'తిష్ట'**
అధికారులు ఉమ్మడి తూర్పు నుండి పశ్చిమకు, పశ్చిమ నుండి తూర్పుకు 'మ్యూజికల్ ఛైర్స్' ఆడుతున్నారే తప్ప గోదావరి జిల్లాలను వదలడం లేదు. కొత్త రక్తం లేదా నిజాయితీ గల అధికారులను రానివ్వకుండా పాత కోటరీయే దశాబ్దాలుగా పాతుకుపోయి వ్యవస్థను ఆక్యుపై చేసింది.

**ప్రజాక్షేత్రంలో వెలికితీయాల్సిన వాస్తవాలు**
గోదావరి జిల్లాల రహదారుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉండటానికి ప్రధాన కారణం ఈ 'అధికారి–కాంట్రాక్టర్–రాజకీయ' త్రయం. ఏసీబీ మరియు ఈడీ ఈ అధికారుల ఆస్తులపై, బదిలీల హిస్టరీపై లోతైన విచారణ చేపడితే వందల కోట్ల కుంభకోణం బయటపడటం ఖాయం. ఏం జరుగుతుందో వేచి చూద్దాం.

# పండగ సమీపిస్తున్న వేళ నాటు మేకలకు గిరాకి



**చాట్రాయి, మేజర్ న్యూస్,** సంక్రాంతి పండగ సమీపిస్తుందంటే మాంసాహార ప్రియులకు మజా ఉంటుంది. దీంతో గ్రామీణ ప్రాంతాలలో ఉండే నాటు మేకలకు, గొర్రెలకు గిరాకీ బాగా పెరిగింది. పట్టణాల్లో దుకాణాలలో పారాలలో పెంచిన మేకల మాంసం మాత్రమే అమ్మకాలు జరుపుతూ ఉంటారు. అయితే పల్లెల్లో తోటల్లో పెంపకం జరిగిన మేకలకు మంచి గిరాకీ ఉంటుంది. పల్లెల్లో ఉండే మేకపోతు మాంసం ఎంతో రుచిగా ఉండటంతో పాటు ఆకు అలము తినటంతో ఆరోగ్యపరంగా కూడా హాని కలగదని ఇష్టపడుతూ ఉంటారు. సాధారణ రోజుల్లోనే మేక మాంసం వెయ్యి రూపాయలు ధర పలుకుతూ ఉంటుంది. తెలుగువారి పెద్ద పండుగ అయిన సంక్రాంతికి పట్టణాలలో ఉద్యోగాలు చేసేవారు, స్థిరపడిన వారు వారి బంధుమిత్రులు సైతం పల్లెల్లో బంధుమిత్రుల ఆహ్వానాల మేరకు విచ్చేస్తూ ఉంటారు. అటువంటి వారికి ఆత్మీయంగా విందును ఇవ్వటంలో గోదావరి జిల్లా వాసులు ప్రఖ్యాతి పొందారనటంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. మామూలు రోజుల్లో వెయ్యి రూపాయలు ఉండే మటన్ ధర వాటాలుగా వేసుకున్నప్పుడు 1200 రూపాయల పైబడి ఉండే అవకాశం ఉందని పల్లెవాసులు పేర్కొంటున్నారు. దీనికి తోడు మేక తలకాయ ,కాళ్లకు, బోటి (పొట్టలో ఉండే ప్రేగులను) కూడా ప్రత్యేక ధరలు ఉంటాయి. ఇందులో భాగంగా సాధారణ సైజు తలకాయ,కాళ్లు 800 నుండి 1200 రూపాయలు వరకు,బోటి 600 నుండి 1000 రూపాయల వరకు ధర పలుకుతుందని పేర్కొంటున్నారు.

## పందెం పుంజు... రూ.5లక్షలు పైనే..!

మొదటిపేజి తరువాయి

ఏడ పెడ సాగాయి. భీమవరం ప్రాంతంలో ఓకో పందెం సరాసరి నాలక్షల్లో పందాలు సాగాయి. హైదరాబాద్, బెంగుళూరు, వైజాగ్ నుంచి వచ్చిన కొందరు మహిళలు కూడా సైఅన్నారు. వైజాగ్ మహిళ ఏకంగా ప్రతి పందెంకు 10 లక్షలకు తగ్గకుండా వరుస పందాలకు దిగడంతో అందరూ బిత్తరబోయారు. ఒక్క సంక్రాంతి రోజున ఆమె 80లక్షలకు పైగా పందాలు గెలిచారు. కోడి పుంజురంగుబట్టిపందెంరాయుళ్ళువేలు గుమ్మరిస్తారు. అలాగే శ్రీనివాసపురంలో పందెంబరులవద్ద రివల్వార్ నుంచి జరిగిన మిస్ ఫైర్ అందరిని వణికించింది. కుక్కునూరు మండలంలో సాగిన పందాలుకు తెలంగాణ నుంచి పెద్ద ఎత్తున కోడి పందాలు చూసేందుకు వేలాది మంది తరలివచ్చారు.

**– క్వాజాకు యమ డిమాండ్** –పందెంలో ఓడినా.. చనిపోయిన పుంజును క్వాజా అని పిలుస్తారు. వీటికు చాలా డిమాండ్. గత ఏడాది క్వాజా ఒకటి 5 వేలు ధర పలికింది. ఇంటికి వచ్చే చుట్టాలను సంతృప్తి పరచ్చేందుకు ఎక్కువగా ఎగబడ్డారు. దీనితో క్వాజా ధరలు భారీగా పెరిగాయి. కొంత మంది హైదరాబాద్‌కు తీసుకువెళ్ళేందుకు ప్రయత్నించడంతో ధరలు ఆకాశానికంటాయి. ఈసారి కూడా క్వాజాలకు భారీగానే డిమాండ్ వినిపిస్తోంది.

**– విఐపిలకు స్పెషల్** –సంప్రదాయం పేరిట జరిగే కోడి పందేలకు ఏకంగా ఎమ్మెల్యేలు, వారితో సీనియర్ నాయుకులు పందేం బరులకు రానున్నారు. వీరి కోసం స్పెషల్ ఏర్పాట్లు చేశారు. వారికీ ప్రత్యేకంగా పందెం కనిపించేలా బరుల వద్ద లాంజ్ లు ఏర్పాటు చేస్తున్నారు. చింతలపూడి, దెందులూరు, నూజివీడు, కైకలూరు, పోలవరం ప్రాంతాల్లో కూడా దూరప్రాంతల నుంచి వచ్చే వారంతా రాత్రి బస చేసేందుకు చెరువు గట్లు, తోటల్లో గుడారాలు వేస్తున్నారు.

## సంక్రాంతి పండుగ ఆటవిడుపు

మొదటిపేజి తరువాయి

నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. తొలిరైడ్‌ను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సాహసోపేతంగా రైడ్‌చేసి స్థానిక నాయకులను, ప్రజలను, యువతను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ భీమవరం ప్రజలకు, సంక్రాంతి సందర్భంగా భీమవరం విచ్చేసిన అతిధులకు సాంప్రదాయ పోటీలతో పాటు కొత్తగా పారా మోటర్ ఏరియల్ అడ్వెంచర్ ను పరిచయం చేస్తున్నామని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలు, చిన్నపిల్లలు, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ భీమవరం అంటే కోడి పందాలు అనే నానుడి ఉందని, దీనికి భిన్నంగా అడ్వెంచర్స్ రైడ్ ని కూడా తీసుకు రావడానికి జిల్లా యంత్రాంగం కృషి చేసిందన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణ ప్రజలతోపాటు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు పారా మోటర్ ఏరియల్ రైడ్ ను అందుబాటులో తీసుకురావడం జరిగిందని తెలిపారు. నేను తొలి రైట్ ను చేయడం జరిగిందని ఎంతో ఆహ్లాదకరంగా, ఉత్సాహంగా ఉందని ఇది మంచి అనుభవం అన్నారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 వరకు రైడ్స్ నిర్వహించడం జరుగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ జుత్తుగ నాగరాజు, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఏ.వెంకట అప్పారావు, ఏపీ అడ్వెంచర్స్ ప్రమోటర్స్ యాజమాన్యం పి.అమర్నాథ్, బి.ప్రవీణ్, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### కోడి కత్తుల తయారీ కేంద్రంపై దాడి : ఒకరి అరెస్టు

మొదటిపేజి తరువాయి

గ్రామం, గణపవరం మండలం. అరెస్టు చేసి అతని వద్ద నుండి 300 సాన బెట్టిన పదునైన కోడికత్తులు, కోడి కత్తులకు సంబందించి 200 చిన్న చిన్న ముక్కలు, ఎలెక్ట్రికల్ గ్రైండ్ మోటార్ ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ వివరించారు. అతని కుల వృత్తి అయిన కత్తులు సానపెట్టడం మొదలు పెట్టి, చుట్టుప్రక్కల గ్రామాల వారికి సంక్రాంతి పండుగకు జరుగు కోడి పందేలకు వేయు కోడి కత్తులు తయారీ,సాన బెట్టడం చేస్తునట్లు సమాచారంపై,ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిశోర్,ఆదేశాలపై,ఏలూరు డిఎస్పీ డి.శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో నిడమర్రు ఇన్స్పెక్టర్ యన్ రజిని కుమార్, గణపవరం పోలీస్ స్టేషన్ ఎస్.ఐ.ఏ. మణి కుమార్, వారి సిబ్బంది ముద్దాయిని అతని ఇంటి వద్ద కోడి కత్తు లకు సాన పెట్టు చుండగా పట్టుకున్నట్టు తెలిపారు.గణపవరం పోలీస్ స్టేషన్ సిబ్బంది పి సి – 2516, డి.శివాజీ, పీసీ 2573,డి.రత్న బాబు, పీసీ 2519– జె. బాబీ,హెజి 852 పి.జగపతిలను పోలీస్ అధికారులు అభినందించారు.

# ఘనంగా సంక్రాంతి సంబరాలు





**– అలరించిన జబర్దస్త్, ఢీ షో కళాకారుల ప్రదర్శనలు,భరత నాట్యాలు**

**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** సంస్కృతి సంప్రదాయాలను తెలియజేస్తూ ప్రతి సంవత్సరం జెఆర్జి డిజిటల్ నెట్వర్క్ సిటీ కేబుల్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని పలువురు ప్రముఖులు కొనియాడారు.పట్టణంలోని జెపి సెంటర్ మైదానం వద్ద జెఆర్జి డిజిటల్ నెట్ వర్క్ సిటీ కేబుల్ ఆధ్వర్యంలో సాయిస్ఫూర్తి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సహకారంతో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను మున్సిపల్ చైర్పర్సన్ బత్తిన నాగలక్ష్మి ప్రారంభించారు.ఈ ముగ్గుల పోటీలకు జెట్టి శైలజ ,మండవల్లి సుజాత, పాలపర్తి భారతిలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి విజేతలకను ఎంపిక చేసారు.తొలుత వీరు భోగి మంటలు వేసి పొంగళ్లు వండారు. అదే విధంగా రాజాన పండు,పెనుమర్తి సురేష్ బాబు లతో కలిసి సిటీ కేబుల్ ఎండి పాలపర్తి శ్రీనివాస్,పాలపర్తి చైతన్య సాంప్రదాయ కోడి పందాలను వేశారు. అనంతరం డిసిసిబి మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు,మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి,జెడ్పిటిసి పోల్నాటి బాబ్జి,టీడీపీ పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్,నెంబర్ వన్ న్యూస్ ఛానల్ అధినేత మంచాల శ్రీనివాస్ నాయుడు వారి బృందంతో కలిసి ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు.

అదే విధంగా స్పాన్సర్లను సత్కరించారు. ఈ సందర్భంగా సిటీ కేబుల్ ఎండి పాలపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ తాము ప్రతి సంవత్సరం ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించడానికి సహకరిస్తున్న స్పాన్సర్లకు, ప్రముఖులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సంక్రాంతి సంబరాలలో భాగంగా జబర్దస్త్, ఢీ షో కళాకారులు,భరత నాట్య శిక్షకురాలు రూపా దేవి శిష్య బృందం,వై డాన్స్ అకాడమీ బృందం, జూనియర్ ఆర్టిస్టులు,మిమిక్రి ఆర్టిస్టులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

## ప్రపంచ వ్యాప్త తెలుగు వారి ఆత్మగౌరవం,సమైక్యతకు ప్రతిక సంక్రాంతి



**– యువ నాయకులు పితాని వెంకట్**

**పెనుమంట్ర,మేజర్ న్యూస్ :** సంక్రాంతి పండుగ ప్రపంచవ్యాప్త తెలుగు వారి ఆత్మగౌరవానికి, సమైక్యతకు ప్రతీక అని స్థానిక శాసనసభ్యులు,సభా హక్కుల క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పితాని సత్యనారాయణ తనయులు పితాని వెంకట్ పేర్కొన్నారు.ప్రజలందరూ సంక్రాంతి పండుగలు సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.మార్టేరు గ్రామం తేతలి గ్రౌండ్లో స్థానిక సీనియర్ టిడిపి నాయకులు తేతలి రాజారెడ్డి నేతృత్వంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు మంగళవారం ఘనంగా జరిగాయి. సందడి వాతావరణంలో జరిగిన వేడుకల్లో యువ నాయకులు పితాని వెంకట్ కూటమి నాయకులు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన రంగవల్లుల ముగ్గుల పోటీలలో వివిధ ఆకృతులలో మహిళలు వేసిన ముగ్గులను ఆయన పరిశీలించారు. అనంతరం తేతలి వెంకటరత్నం జ్ఞాపకార్థం తేతలి రాజారెడ్డి దివాన్ కాట్ సెట్, అనుమల శెట్టి రాంబాబు ద్వితీయ, తృతీయ బహుమతులు ఏర్పాటు చేయగా ముగ్గుల పోటీలలో విజేతలకు యువ నాయకులు పితాని వెంకట్, మహిళలతో కలిసి బహుమతులను అందించారు.వేడుకల్లో భాగంగా జరిగిన సభలో వెంకట్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజానీకానికి కూటమి పార్టీల తరపున, స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ కుటుంబం తరపున భోగి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధ్యక్షుడు కోనాల శ్రీను,నాయకులు తమనంపూడి బుల్ల,మహిళా నాయకురాలు కొవ్వూరి సీత,తేతలి సోమిరెడ్డి, సుబ్బరాజు,చిర్ల బాలాజీ రెడ్డి,ఆచారి,కట్టా టారి,వెలగలేరు సొసైటీ చైర్మన్ బొక్క నాగేశ్వరావు, వెలగల మల్లీ,ఓఎన్జీసీ వెంకటేశ్వరరావు,తోలేటి రాంబాబు,పాల ప్రసాద్, జనసేన ఆలీ,బిజెపి ప్రసాద్ రెడ్డి,ఆకేటి వెంకటరావు,తేతలి సుందర్ రామిరెడ్డి, పెచ్చేటి దుర్గారావు సంక్రాంతి సంబరాల కమిటీ పెద్దలు,మండల ప్రముఖులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# భీమవరం నుంచి డిజిటల్ విప్లవానికి శ్రీకారం



**– రూ.35 కోట్లతో అండర్ గ్రౌండ్ కేబుల్, అతి తక్కువ ధరకే ఇంటర్నెట్ : బీసీఎన్**

**భీమవరం,మేజర్ న్యూస్ :** గత 35 ఏళ్లుగా ప్రేక్షకుల హృదయాలకు అత్యంత దగ్గరగా నిలిచిన బీసీఎన్ సంస్థ మరో సాంకేతిక విప్లవానికి సిద్ధమవుతోంది. ఉభయ గోదావరి జిల్లాల్లో రూ.35 కోట్ల పెట్టుబడితో అండర్ గ్రౌండ్ కేబుల్ నెట్‌వర్క్ ఏర్పాటు చేసి, దేశంలో ఎవరూ ఇవ్వలేనంత తక్కువ ధరకే హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందించబోతున్నామని బీసీఎన్ మేనేజింగ్ పార్టనర్లు రుద్రరాజు శ్రీనివాసరాజు, ముదునూరి రాజ గోపాలరాజు ప్రకటించారు. మంగళవారం భీమవరంలోని బీసీఎన్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ 1991లో ఒకే ఒక్క కేబుల్ ఆపరేటర్‌తో బీసీఎన్ సంస్థను ప్రారంభించామని, ఇప్పుడు ఉభయ గోదావరి జిల్లాల్లో విశ్వసనీయమైన బ్రాండ్‌గా ఎదిగిందన్నారు. కేవలం 5 ఎంబీపీఎస్ వేగంతోనే ఎలాంటి ఆటంకం లేకుండా ఐపీటీవీ ప్రసారాలు వీక్షించవచ్చని, ఇంటర్నెట్ ఆధారిత మరింత నాణ్యమైన సేవలను త్వరలో అందు బాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పాలకొల్లు, నరసా పురం ఆర్ఎంఎస్ఓ ఆర్.దొరబాబు,అమలాపురం ఆర్ఎంఎస్ఓ మెట్ల రమణబాబు, మొగల్తూరు ఆర్ఎంఎస్ఓ కాసాని రామకృష్ణ మాట్లాడుతూ 'సాంకేతికంగా ముందుండే బీసీఎన్, గతంలో హెచ్‌డీ బాక్సులతో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. ఇప్పుడు ఇంటర్నెట్ రంగంలోనూ మరో కొత్త అధ్యాయానికి నాంది పలకడం అభినందనీయం" అని ప్రశంసించారు.ఈ సమావేశంలో బీసీఎన్ డైరెక్టర్లు రుద్రరాజు లోకేష్ వర్మ, రుద్రరాజు రాహుల్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

## రైతు వ్యతిరేక కేంద్ర చట్టాల కాపీలను భోగి మంటల్లో వేయండి

**– ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం**
**జిల్లా సమావేశం నిరసనలకు పిలుపు**



**ఏలూరు,మేజర్ న్యూస్ :** రైతులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ సవరణ బిల్లు,విబిజి రామ్ జి గ్రామీణ ఉపాధి పథకం చట్టం,విత్తన చట్టం వంటి కేంద్ర చట్టాలను భోగిమంటల్లో వేసి నిరసన వ్యక్తం చేయాలని జిల్లా రైతులకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సమావేశం పిలుపునిచ్చింది. మంగళవారం ఏలూరు అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. జిల్లాలోని రైతాంగ సమస్యలపై పలు తీర్మానాలు ఆమోదించారు.ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర మోడీ ప్రభుత్వం రైతులకు,ప్రజలకు వ్యతిరేకంగా కార్పొరేట్ కంపెనీలకు ఉపయోగపడే విధంగా అనేక చట్టాలు తీసుకువస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ రంగాన్ని పూర్తిగా ప్రైవేటికరించేందుకు కేంద్ర విద్యుత్ సవరణ బిల్లు తీసుకువచ్చిందని రాష్ట్రాల హక్కులను హరించి వేస్తూ ప్రజలపై భారాల మోపే విధంగా కేంద్ర విద్యుత్ బిల్లు ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు కోన శ్రీనివాసరావు, సిరి బత్తుల సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

### తేనెటీగల దాడికి పామాయిల్ ఫీల్డ్ అసిస్టెంట్ రమణ మృతి



**చాట్రాయి,మేజర్ న్యూస్:** గోద్రెజ్ పామాయిల్ కంపెనీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న గుండ్ల వెంకటరమణ తేనెటీగల కుట్టడంతో మృతి చెందారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాలవ సమీపంలో ఉద్యోగ విధులు నిర్వహిస్తున్న సమయంలో తేనెటీగలు వెంకటరమణ పై దాడి చేశాయి. స్థానికులు వెనువెంటనే విస్సన్నపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంకటరమణ కామవరపుకోట చింతలపూడి తదితర మండలాలలో విధులు నిర్వహించారు. వెంకటరమణ విధులు నిర్వహించే చోట రైతులతోపాటు మిగతా ప్రజలతో కూడా మమేకమై ఉండేవారని పలువురు పేర్కొన్నారు. వెంకటరమణ మృతి విషయం తెలిసిన పలువురు రైతులు, సన్నిహితులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినవి

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం పట్టణానికి చెంది స్థానిక శారదా హాల్ రోడ్ లోని డోర్ నెంబర్8-8-60/1లో నివాసం ఉంటున్న సలాది వెంకట రవి కిరణ్ సన్నాఫ్ సలాది ఆది వీర వెంకట సత్యనారాయణ తెలియజేయునది ఏమనగా స్థానిక జ్యోసులవారి వీధిలోని 15-12-2003లో రిజిస్టర్ అయిన 3702/2003,23-5-1979లో రిజిస్టర్ అయిన1369/79 2491/2 చదరపు అడుగుల ఆర్సీసీ బిల్డింగ్ లింక్ డాక్యుమెంట్లు పడిపోయినవి.ది 5-1-2026వ తేదీన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు పాలకొల్లు వెళ్లినరసాపురం తిరిగివస్తూ స్థానిక పెదగోపురం సమీపంలోచూడగా ద్విచక్రవాహనానికి తగిలించినబ్యాగు పడిపోయినది. అందులో ఈఒరిజినల్ డాక్యుమెంట్లు ఉన్నవి.దొరికినవారు అందజేయ వలసిందిగా కోరుచున్నాను.

ధన్యవాదములతో

**సలాది వెంకట రవికిరణ్**

నరసాపురం

ఫోన్ నెంబర్ 6302507848

# జ్ఞాపకాలతో ముగిసిన ఎస్వికెపి స్వర్ణోత్సవ వేడుకలు





– గతానికి గౌరవం – భవిష్యత్తుకు సంకల్పం

**పెనుగొండ,మేజర్ న్యూస్:** విద్యా రంగంలో ఐదు దశాబ్దాల ఘన చరిత్రను స్మరించుకుంటూ నిర్వహించిన ఎస్వికెపి కళాశాల స్వర్ణోత్సవ సంబరాలు ఘనంగా ముగిశాయి. మూడు రోజుల పాటు మధుర జ్ఞాపకాలతో చిరస్థాయిగా నిలిచాయి.ముగింపు రోజున నిర్వహించిన సభలో ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ, ఏపీ శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, మండలి సభ్యులు బొర్రా గోపి మూర్తి, వంకా రవీంద్రనాథ్ పాల్గొని కళాశాల ప్రస్థానాన్ని కొనియాడారు.ప్రిన్సిపాల్ డాక్టర్ వైవివి అప్పారావు మాట్లాడుతూ స్వర్ణోత్సవాలు గతాన్ని స్మరించుకునే సందర్భం మాత్రమే కాకుండా భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకునే వేదికగా నిలిచాయని, రాబోయే రోజుల్లో కళాశాల మరింత అభివృద్ధి చెందేందుకు అందరి సహకారం అవసరమని పిలుపునిచ్చారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు మాట్లాడుతూ కళాశాల స్థాపించిన నాటి నుండి నేటి వరకు కళాశాల అభివృద్ధికై పాటుపడిన పాలకవర్గ మండలిని అందులోని సభ్యులను పేరుపేరునా గుర్తు చేసుకుంటూ కళాశాల ఈ స్థాయికి రావడానికి కృషిచేసిన గత ప్రిన్సిపాల్స్ అందరిని కూడా గుర్తుపెట్టుకుని సమావేశంలో వారికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కళాశాల పాలకవర్గ సభ్యులు కోట్ల వెంకటేశ్వర రావు మాట్లాడుతూ కళాశాలఫౌండర్ ప్రెసిడెంట్అయినకోట్ల వెంకట్రామయ్య దగ్గరమలపాక సుబ్రహ్మణ్యం అనే సలహాదారు ఉండేవారు.ఆయన సలహా ఇవ్వడం వల్లనే ఈ కళాశాల ప్రారంభం అయ్యిందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు,ఉభయ కళాశాలల ప్రిన్సిఫాల్స్ అతిథులను, పాలకవర్గ సభ్యులను, డాక్టర్ కె. రామచంద్రరాజు గారి దంపతులను ఘనంగా సన్మానించారు.

అనతరం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా కళాశాల పూర్వవిద్యార్థి,ప్రముఖ సినీ ఆర్టిస్ట్ భోగిరెడ్డి శ్రీనివాస్ కుమార్తె శ్రవ్య మానస కూచిపూడి నృత్యంతో ఆహూతలను అలరించింది. ఋషి ఆర్కెస్ట్రా సంగీత విభావరి స్వర్ణోత్సవ ముగింపు వేడుకకు విచ్చేసిన వారినందరిని ఉర్రూతలూగించింది. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.వి.ఆర్ సూర్యనారాయణ, పాలకవర్గ సభ్యులు ప్రముఖ న్యాయవాది పిల్లి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మద్ది ఆలయంలో తమలపాకులతో అష్టోత్తరం పూజలు



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** మండలం గుర్వాయిగూడెం గ్రామంల శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి దర్శనార్థము చుట్టు ప్రక్కల గ్రామముల నుండి యేగాక సుదూర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీస్వామివారి ఆలయం చుట్టూ 108 ప్రదక్షణలు చేసి, మొక్కుబడులు తీర్చుకున్నారు.స్వామి వారికి అత్యంత ప్రీతీకరమైన తమలపాకులు (నాగవల్లీ దళములు)తో అష్టోత్తరం పూజలను, అన్నప్రాసనలు, వాహనం పూజలను ఆలయ అర్చకులచే నిర్వహించుకున్నారు. మంగళవారం శ్రీ స్వామి వారి దర్శనార్థం సాయంత్రం 3గం.ల వరకు విచ్చేసిన సుమారు 1750 భక్తులకు నిత్యాన్నదాన సత్రం నందు అన్నప్రసాద వితరణ జరిగింది. దేవస్థానంకు వివిధ సేవల రూపేణా రూ.2,89,600లు ఆదాయం వచ్చింది. శ్రీ స్వామి వారి దర్శనార్థమై విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా తగిన ఏర్పాట్లుగావించినట్లు ఆలయ సహాయకమీషనర్,కార్యనిర్వహణాధికారిణి ఆర్.వి చందన తెలిపారు.

# రైతులకు విరివిగా పంట రుణాలు అందించాలి





– జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశం

**భీమవరం,మేజర్ న్యూస్ :** కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరం నందు మంగళవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన రానున్న ఖరీఫ్, రబీలలో పండించే వివిధ రకాల పంటలకు ఆర్థిక సహాయ పరిమితిని నిర్ణయించడానికి ప్రతిపాదిత విలువలపై సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ రైతు అన్నం పెడుతున్నారు అనేకన్నా దేశాన్ని ఆర్థికంగా ముందుకు నడిపిస్తున్నారనేది నూరు శాతం నిజం అన్నారు.

మన జిల్లాలో సుమారు 85శాతం కౌలు రైతులు ఉన్నారని, ఆయా ప్రాంతాల్లో ఉన్న రైతులందరినీ జిల్లాలో ఉన్న 128 కోఆపరేటివ్ సొసైటీలలో నెంబర్లుగా నమోదు చేయించే కార్యక్రమాన్ని జనవరి నెలాఖరులకు పూర్తి చేయాలని ఆదేశించారు.

అలాగే అర్హులైన ప్రతి ఒక్క రైతుకు ఫిబ్రవరి 15 లోపు పంట రుణాలను అందించాలన్నారు.

కొబ్బరి,కోకో, కూరగాయల రైతులు 250 మందిని, మత్స్యకారులు సముద్రం, కాలువ ద్వారా వేటకు వెళ్లేవారు 2,500 మందిని, పాడి రైతులు 3వేల మంది, వ్యవసాయ రంగంలో ఉన్న 25 వేల మందిని అందర్నీ సొసైటీలలో నెంబర్లుగా చేర్పించేందుకు లక్ష్యంగా నిర్ణయించడం జరిగింది. త్వరలో సొసైటీ సెక్రటరీ, ప్రెసిడెంట్లకు ఆన్లైన్ సమావేశం నిర్వహించాలని ఆదేశించారు.

సభ్యత్వం కోసం ప్రతి ఒక్క రైతు రూ.300 లు చెల్లించాల్సి ఉంటుందని, రుణాలు మంజూరు చేసిన రైతుల నుండి రుణం మొత్తంలో 10 శాతం మూలధనంగా ఉంచడం జరుగుతుంది అన్నారు.

అర్హులైన వారికి రూ.1.50 లక్షలు తొలి విడతగా 20 వేల మందికి రుణాలను అందించడం జరుగుతుంది అన్నారు.ఈ సమావేశంలో డిస్టిక్ కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ సీఈవో కె.సింహాచలం, జనరల్ మేనేజర్లు ఎ.మాధవి మూర్తి, ఎం.శ్రీనివాస్, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ఎం.నాగేంద్ర ప్రసాద్, జిల్లా కోపరేటివ్ సహకార శాఖ అధికారి ఎం.మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డి హెచ్ ఓ ఎం.హరి ప్రసాద్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఆర్.కోటిలింగం, మత్స్య శాఖ అధికారి ఎల్ ఎన్ రాజు, బ్యాంకర్స్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలు పాటించాలి



**జంగారెడ్డిగూడెం ,మేజర్ న్యూస్ :** ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ సురక్షితమైన ప్రమాణాలు చేయాలని జంగారెడ్డిగూడెం ట్రాఫిక్ పోలీస్శాఖ ప్రజలకు పిలుపు నిచ్చింది. ఏఎస్పీ సుస్మిత రామనాథన్ ఆదేశాలపై ఇన్స్పెక్టర్ ఎం.వి.సుభాష్ ఆధ్వర్యంలో మంగళవారం ట్రాఫిక్ ఎస్ఐ కుటుంబరావు వారి సిబ్బందితో ట్రాఫిక్ నియమాలపై అవగాహన చర్యలు చేపట్టారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలు గుర్తించి హెల్మెట్ వినియోగంపై దృష్టి పెట్టారు. ట్రాఫిక్ ఎస్ఐ కుటుంబరావు పట్టణ పరిధిలో ప్రత్యేక ట్రాఫిక్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో నెంబర్ ప్లేట్ లేని 53 ద్విచక్ర వాహనాలను గుర్తించి వాహన యజమానులకు నెంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఏర్పాటు చేయించారు.అలాగే హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న వారిపై జరిమానాలు విధించకుండా వారితో తక్షణమే హెల్మెట్ కొనుగోలు చేయించి సురక్షిత ప్రయాణాలపై అవగాహన కల్పించారు

## పట్టణాభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా ?

– వైసిపి శ్రేణులకు టిడిపి నాయకుల సవాల్



**జంగారెడ్డిగూడెం,మేజర్న్యూస్:** మున్సిపాలిటీలో 2014 నుంచి 2019 వరకు టిడిపి కూటమి చేసిన అభివృద్ధి 2019 నుంచి 2024 వరకు మీరు చేసిన అభివృద్ధి పై శ్వేత పత్రంను విడుదల చేసి,బహిరంగ చర్చకు సిద్ధమా అని పట్టణ టిడిపి ప్రెసిడెంట్ కొండ్రెడ్డి కిషోర్,కౌన్సిలర్ లు కరుటూరి రమాదేవి,తెలగారపు జ్యోతి వైసిపి మున్సిపల్ పాలకవర్గానికి బహిరంగ సవాల్ విసిరారు.స్థానిక టిడిపి పట్టణ కార్యాలయంలో మంగళవారం కొండ్రెడ్డి కిషోర్ మీడియా సమావేశాన్ని నిర్వహించారు. గత కొద్ది రోజులుగా వైసీపీ శ్రేణులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపాలిటీ అభివృద్ధి కుంటిపడిందని ఆరోపణలు ఆరోపించటంపై తీవ్రంగా ఖండించారు. సమావేశంలో బిజెపి నాయకులు కొప్పాక శ్రీనివాసరావు, తాటికొండ సుధాకర్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ సిహెచ్ రామలింగేశ్వర రావు,జిల్లా టిడిపి అధికార ప్రతినిధి రాజ్ పాల్ కుమార్, సొసైటీ డైరెక్టర్ పాతూరి అంబేద్కర్ ,తదితరులు వైసీపీ నాయకులపై, మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై తీవ్ర ధ్వజమెత్తారు. సమావేశంలో పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి కోనేటి చంటి,డైరెక్టర్ బుల్లి,గెడా సుబ్రహ్మణ్యం,కరణం రాంబాబు,తదితరులు పాల్గొన్నారు.

## జనార్ధనవరంలో కోడి పందాల బరులు ధ్వంసం



**చాట్రాయి,మేజర్ న్యూస్,** మండలంలోని జనార్ధన వరంలో కోడిపందాల బరులను ధ్వంసం చేసినట్లు చాట్రాయి ఎస్సై డి రామకృష్ణ తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించడం కోసం పలు నినాదాలతో కూడిన ఫ్లెక్సీ బ్యానర్లతో యువకులతో పోలీసు సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. సంక్రాంతి పేరిట కోడి పందాలు పేకాట వంటి క్రీడలను పోలీసు శాఖ ప్రోత్సహించదని, పోలీస్ స్టేషన్ పరిధిలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చాట్రాయి ఎస్సై 9440796455 నెంబర్కు తెలియజేయాలన్నారు.

# జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేదు

- రైతులను ఆందోళనకు గురిచేసున్న ప్రతిపక్షాలు
- చాట్రాయి నరసింహరావుపాలెంలో ఎరువుల నిల్వలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి పార్థసారథి



**చాట్రాయి,మేజర్ న్యూస్:** జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరతా లేదని రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. చాట్రాయి మండలం నరసింహరావుపాలెంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల గోడౌన్ ను, ఎరువుల దుకాణాలను మంత్రి మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోడౌన్లలో ఉన్న ఎరువుల నిల్వలు, రిజిస్టర్లను మంత్రి పరిశీలించారు.అక్కడకు వచ్చిన రైతులను వారి సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు.చాట్రాయి మండలం, నరసింహరావుపాలెంలో రైతులకు అవసరాలకు సరిపడిన ఎరువుల నిల్వలు ఉన్నాయని, ఇంకా అవసరమైతే ఎరువులను అందుబాటులోకి తీసుకువస్తామని, ఎరువుల విషయంలో రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దన్నారు. కొందరు కావాలని ఎరువుల కొరత ఉందని వదంతులను సృష్టిస్తున్నారని, రైతులు వాటిని నమ్మవద్దన్నారు. రైతుల సంక్షేమం కోసమే ప్రభుత్వం పనిచేస్తుందని, రైతుల సమస్యలను ముందుగానే తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి ప్రభుత్వం ఎప్పుడూ ముందు ఉంటుందన్నారు. జిల్లాలో ఎటువంటి ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోమని వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించడం జరిగిందని, అధికారులు కూడా 10 రోజులకు సరిపడా ఎరువుల నిల్వలను బఫర్ స్టాక్గా నిల్వ ఉంచుతూ, ఎక్కడైనా ఎరువుల కొరతను ముందుగానే గుర్తించి అక్కడకు వెంటనే ఎరువులను సరఫరా చేస్తున్నారన్నారు.ఈ సందర్భంగా ఎరువులను మంత్రి స్వయంగా ఎరువులకు అందించారు. మంత్రి వెంట వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ భాషా, రెవిన్యూ, వ్యవసాయ శాఖాధికారులు ఉన్నారు.

## బియ్యపుతిప్పలో వైసీపీ నుండి జనసేనలో చేరికలు



**నరసాపురంరూరల్,మేజర్ న్యూస్:** మండలంలోని సముద్ర శివారు గ్రామం బియ్యపు తిప్ప ఉప సర్పంచ్ ఒడుగు శ్రీను, మల్లాడి రాజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి జనసేన పార్టీలో చేరారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన సిద్ధాంతాలకు, పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలకు, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ నాయకత్వానికి ఆకర్షితులై, బియ్యపుతిప్ప జనసేన పార్టీ అధ్యక్షులు మల్లాడి లక్ష్మణ స్వామి ఆధ్వర్యంలో అధికారికంగా జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ వారికి జనసేన కండువాలు కప్పి పార్టీలోకి ఆత్మీయ ంగా స్వాగతం పలికారు. అనంతరం మాట్లాడుతూ జనసేన పార్టీని మరింత బలోపేతం చేసి నరసాపురం నియోజకవర్గ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మత్స్యకార సహకార సంఘాల అధ్యక్షులు మైల వసంతరావు, వేములదీవి వెస్ట్ సర్పంచ్ ఒడుగు ఏసుబాబు, వలవల నాని గంట కృష్ణతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాత జ్ఞాపకాలు నెమరువేసుకున్న పూర్వ విద్యార్థులు

- 20 సంవత్సరాలు గడిచిన సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం




**చింతలపూడి,మేజర్ న్యూస్ :** విద్యాభ్యాసం పూర్తయి 20 సంవత్సరాలు గడిచిన సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకుని తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.చింతలపూడి మండలం ప్రగడవరం మహాత్మా జిల్లా పరిషత్ హై స్కూల్లో 2003--2004 విద్యాసంవత్సరానికి చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యాభ్యాసం పూర్తయి 22 సంవత్సరాలు గడిచిన సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకుని తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.అప్పటి మిత్రులంతా నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ అందరూ ఆనందంగా గడిపారు.ఈ సందర్భంగా బోలెడన్ని భావోద్వేగ దృశ్యాలు కనిపించాయి.ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని తమ బాగోగులు, కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆనాటి రోజుల్లో విద్యాబుద్ధులు నేర్పి జీవితానికి దిశానిర్దేశం చేసిన గురువులను అందరూ కలిసి ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. గురువుల మార్గదర్శకత్వమే తమ ఉన్నతికి బాటలు వేసిందని ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు.ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఇలాంటి సమ్మేళనాలు స్నేహబంధాలను మరింత బలపరుస్తాయని, భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలు కొనసాగించాలని వారు ఆకాంక్షించారు.

## వెలమ యువజన సంఘ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

- సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొలిశెట్టి



**పెంటపాడు, మేజర్ న్యూస్;** పెంటపాడు వెలమ యువజన సంఘం ఆధ్వర్యంలో గౌరీదేవి ఆశీస్సులతో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముగ్గుల పోటీలను మహిళలకు, చిన్నారులకు రెండు విభాగాలలో నిర్వహించారు. పిండి వంటల పోటీలు నిర్వహించి శాసనసభ్యులు చేతుల మీదుగా బహుమతి ప్రధానోత్సవం చేశారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఎడ్ల బండి పై గంగిరెడ్ల మేళంతో వచ్చి భోగి మంటలు వెలిగించి, గంగిరెద్దుల విన్యాసాలు తిలకించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కులమతాల కతీతంగా జరుపుకున్న ఈ పండుగను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహిస్తున్న నిర్వాహకులు కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, దాసరి కృష్ణవేణి, సూరిబాబు పలువురు సభ్యులను అభినందించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఏ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు చిన్నారులు పాల్గొన్నారు.

## పట్టాదారు పాసుపుస్తకాలు తప్పులు సరి చూసుకుని దరఖాస్తు చేసుకోవాలి

- జేసి టి.రాహుల్ కుమార్ రెడ్డి



**వీరవాసరం,మేజర్ న్యూస్ :** రైతులు పాసు పుస్తకాలలో వివరాలు ఫోటో, పేరు, సర్వే నెంబరు, విస్తీర్ణ, ఆధార్ నెంబరు వంటివి ఏమైనా తప్పిదాలు ఉంటే పరిశీలించుకుని సరి చేయించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి రైతులకు సూచించారు. వీరవాసరం మండలం రాయకుదురు గ్రామం సచివాలయం వద్ద మంగళవారం రైతులను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. సంబంధించిన పాసు పుస్తకంలో వివరాలు ఏమైనా తప్పులుగా ఉంటే వాటిని పరిశీలన చేసుకోవాలని సూచించారు. దీనికోసం రెవిన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నారని అన్నారు. జాయింట్ ఎల్ పి ఎంలుగా ఉన్నవి ఎక్కడ తప్పులు ఉన్నవి కరెక్టు చేయించుకోవాలని అన్నారు. ఈ సందర్భంలో ఆర్డీఓ కె. ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసిల్దార్ రామశీజేనేయులు, వీఆర్వోలు, ప్రజా ప్రతినిధులు రైతులు తదితరులు ఉన్నారు.

# జనగణన పారదర్శకంగా నిర్వహించడానికి ప్రత్యేక ప్రణాళిక






- వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ నాగరాణి

**భీమవరం,మేజర్ న్యూస్:** జిల్లాలో జనగణన కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.అమరావతి నుండి ఇన్చార్జి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్ రావత్ అన్ని జిల్లాల కలెక్టర్లతో మంగళవారం జనగణన కార్యక్రమాల అమలుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఈ సర్వేకు ప్రజలు ప్రతి ఒక్కరు సహకరించాలని తెలిపారు. ఆరు నెలల నుంచి ఎడాది పాటు జరిగే ఈ ప్రక్రియకు కాగిత రహితంగా డిజిటల్ యాప్ ద్వారా జనగణన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టిన చర్యలపై జిల్లా కలెక్టర్ వివరిస్తూ జిల్లా ముఖ్య జనాభా లెక్కల అధికారిగా కలెక్టర్గా వ్యవహరించడం జరుగు తుందని, అదనపు జనాభా లెక్కల అధికారిగా జేసీ, నియమించడం జరిగిందని పేర్కొన్నార. జిల్లా జనాభా లెక్కల అధికారిగా డిఆర్ఓ ను నియమించడం జరిగిందన్నారు. జిల్లా ప్లానింగ్ ఆఫీసర్, జిల్లా విద్యాశాఖాధికారి, జడ్పీ సీఈవో, సర్వే శాఖ ఏడీ, పంచాయతీరాజ్ అధికారి, జిల్లా ఫారెస్టు ఆఫీసర్ను జిల్లా అదనపు జనాభా లెక్కల అధికారులుగా నియమించడం జరిగిందని వివరించారు. సమర్థంతంగా జనగణ జనగణన ప్రక్రియ పార దర్శకంగా నిర్వహించడానికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయుచున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా ప్రణాళిక అధికారి కె.శివ పార్వతి, డీఈవో ఇ.నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## సూర్య క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బాలరాజు



**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్:** ప్రభుత్వానికి ప్రజలకు మధ్య నిరంతరం వారిదిగా ఉండే దినపత్రిక 'సూర్య' అని శాసనసభ్యులు చిర్రి బాలరాజు పేర్కొన్నారు. మంగళవారం బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు బాలరాజు సూర్య క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న సూర్య యాజమాన్యానికి దినపత్రికలో పనిచేస్తున్న సిబ్బందికి నూతన సంవత్సర సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ముగిసిన గొర్రెల లక్ష్మీ నారాయణ ఫౌండేషన్ క్రికెట్ పోటీలు







**– విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే బొలిశెట్టి,వలవల, ముళ్ళపూడి, ఈతకోట**

**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్;** తాడేపల్లిగూడెం శశి కళాశాల వద్ద గల క్రికెట్ మైదానంలో గత 15 రోజులుగా గొర్రెల లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలోవాకర్స్ అసోసియేషన్ గ్రౌండ్ నందు, టెన్నిస్ బాల్ మెగా క్రికెట్ టోర్నమెంట్‌లు ముగిసాయి. సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్లో జి.పందు లెవెన్స్, పెంటపాడు లెవెన్స్ జట్లు తలపడగా పందు లెవెన్స్ విజేతగా నిలిచింది. ఈ టోర్నమెంట్ లో బెస్ట్ బ్యాట్స్ మన్ ప్రమోద్, బెస్ట్ బౌలర్ శ్రీనివాస్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ చందు గా నిలిచారు. విజేతలకు గొర్రెల లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ద్వారా విన్నర్స్ కు మొదటి బహుమతి 25వేల రూపాయలు,రన్నర్స్ కు రెండవ బహుమతి 15వేల రూపాయలు, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ 6వేలు రూపాయలు, బెస్ట్ బ్యాట్స్మెన్, బెస్ట్ బౌలర్ 2500 రూపాయలు, ప్రతి ఆటగాడికి మెడల్స్, ట్రోఫీలు అందజేశారు. విజేతలకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, తాడేపల్లిగూడెం పట్టణ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్,ఫౌండేషన్ అధ్యక్షులు గొర్రెల సురేష్, గొర్రెల లక్ష్మీనారాయణ ఫౌండేషన్ సభ్యులు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవన నిర్మాణ మరియు ఇతర నిర్మాణ కార్మికుల బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి), పశ్చిమ గోదావరి జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు,రాష్ట్ర టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘ కార్పొరేషన్ డైరెక్టర్ పద్మనాభుని మురళీమోహన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బిసీసు కృష్ణమోహన్, పాతూరి రాంప్రసాద్ చౌదరి, బిజెపి నాయకులు నరిసే సోమేశ్వరరావు, కూటమి నాయకులు గొర్రెల శ్రీధర్ యువసేన సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎంపీ పుట్టా మహేష్ చిత్రపటానికి పాలభిషేకం



**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్:** రైతుల సమస్యలపై తక్షణమే స్పందించి సమస్యల పరి ష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ చిత్రపటానికి రైతులు పాలభిషేకం చేశారు. మంగళవారం పిరాజవరంలో పొగాకు ఆయిల్ ఫామ్ రైతులు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం పొగాకు వేలంకేంద్రం-18 అధ్యక్షులు పరిమి రాంబాబు,టిడిపి మండల అధ్యక్షులు సుంకవల్లి సాయి మాట్లాడుతూ పొగాకు రైతులకు ఎన్వోసీ లేకుండా టొబాకో బోర్డు అధికారులు టుబాకో బేరన్ లైసెన్స్‌ను రెన్యువల్ చేయకపోవడంతో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే స్పందించి ఉన్నత అధికారులతో మాట్లాడి ఎన్వోసీ లేకుండా రైతులకు రిజిస్ట్రేషన్ చేసే విధానాన్ని తీసుకువచ్చారని దీంతో రైతులంతా వారికి రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గం యాదవ సంఘం అధ్యక్షులు, పి అంకంపాలెం ఎంపిటిసి నాలి శ్రీను,ఏఎంసి డైరెక్టర్ గద్దె సుబ్రహ్మణ్యం, నాయకులు ఆకిరెడ్డి ప్రసాద్, వెలగల అజయ్, ఉండవల్లి రామకృష్ణ, టిడిపి బీసీ సెల్ మండల అధ్యక్షులు తోట బాలు, కోనాల శ్రీను, పీతల వెంకటేశ్వరరావు, అచ్యుతరావు,ఉండవల్లి కిరణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## సౌత్ జోన్ యోగాసన పోటీలలో ప్రతిభ కనబరిచిన కార్తిక



**తణుకు,మేజర్ న్యూస్;** యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ విభాగం నుండి పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన కార్తిక ఎంబీఏ విద్యార్థి పాల్గొనడం అత్యుత్తమ ప్రతిభ కనపరిచి పథకం కైవసం చేస్తుంది. సౌత్ జోన్ ఉమెన్స్ అస్మితా కేలో ఇండియాలో పాల్గొనడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన ఈ పోటీలలో ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, పాండిచ్చేరి, కర్ణాటక, కేరళ రాష్ట్రంలకి గానూ అత్యంత ప్రతిభను కనబరిచి ద్వితీయ స్థానం సాధించింది. తద్వారా ఢిల్లీలో జరగనున్న కేలో ఇండియా తదుపరి దశ పోటీలకు అర్హత సాధించిందని నిర్వాహకులు తెలియజేశారు. కార్తిక ని అభినందించిన రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఎస్.రాధిక, సెక్రటరీ ప్రేమ్ కుమార్,( వైయస్ ఏ ఏపీ), వైయస్ఏ పశ్చిమ గోదావరి అధ్యక్షులు ఉప్పలపాటి వెంకటేశ్వరరాజు, సెక్రటరీ ఆరా ఫౌండేషన్ యోగా గురువు కరిబండి రామకృష్ణ పలువురు అభినందించారు.

# ఉద్యోగులు, గ్రామస్తుల ఐక్యతే యువతకు స్ఫూర్తి

**– ఎస్సై క్రాంతి కుమార్ పిలుపు**




**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్:** ఉద్యోగులు గ్రామస్తులు ఐక్యతే యువతకి స్ఫూర్తిగా నిలవాలని జీలుగుమిల్లి ఎస్సై వి.క్రాంత్ కుమార్ పిలుపు నిచ్చారు. ఉద్యోగస్తులు గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన వాలీబాల్, ముగ్గుల పోటీల విజేతలకు ఆయన బహుమతి ప్రధానం చేశారు. మండలంలోని టి.గంగన గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని టి.గంగన్నగూడెం, దిబ్బగూడెం, పాములవారిగూడెం గ్రామాలలో ఉన్న ఉద్యోగస్తులు,గ్రామస్తుల భాగస్వామ్యం ఐక్యతతో వాలీబాల్ ముగ్గులు పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతికి వాలీబాల్ ములగలంపల్లి సర్పంచ్ కోర్సవెంకటలక్ష్మి రూ.15 వేలు నగదు బహుమతి అందించారు. రెండవ బహుమతి వాలీబాల్ దాట్లవారిగూడెం కూరం ప్రసాద్ రూ.10,116, మూడవ బహుమతి మడకంవారిగూడెం చేప రవి 7,116. నాలుగో బహుమతి టి. గంగన్నగూడెం సోయం చక్రవర్తి 5,116 నగదు బహుమతులను అందించారు, ముగ్గుల పోటీలకు కుంజ రాంబాబు 6వేలు బహుమతులను ప్రకటించారు.యువతకు స్ఫూర్తిని కలిగించాలనే ఉద్దేశంతో ఆటల పోటీలు నిర్వహించినట్లు గ్రామ సర్పంచ్ కోర్స వెంకటలక్ష్మి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మొడియం వెంకటలక్ష్మి, సీనియర్ ఉద్యోగస్తులు బాలకృష్ణ (రైల్వే డిపార్ట్మెంట్), ఉపాధ్యాయులు పండు నాగేశ్వరావు,కొమరం సత్యనారాయణ ఫిజికల్ డైరెక్టర్స్ తాటి వెంకటేశ్వరరావు, కోర్స నాగేశ్వరావు, ధారబోయిన దుర్గారావు. ఉపాధ్యాయులు మొడియం వెంకటేశ్వరరావు, మొడియం ఆనందరావు,కుంజ సుబ్బారావు, కోర్స రాజు, కుమ్మరి ఏసు, కుంజ రాంబాబు హెల్త్ అసిస్టెంట్ కూరం ప్రసాద్, చేప రవి, గ్రామస్తులు ఉద్యోగస్తులు మహిళలు గ్రామ కమిటీ యూత్ పాల్గొన్నారు.

## ఎల్ బి చర్ల సొసైటీలో రైతులకు డివిడెంట్లు పంపిణీ



నరసాపురం రూరల్,మేజర్ న్యూస్: మండలంలోని ఎల్బీ చర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతిసంఘంలో మంగళవారం రైతులకు డివిడెంట్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ గుబ్బల వీరాస్వామి మాట్లాడుతూ సొసైటీకి వస్తున్న లాభాలలో పది శాతం నిధులను రైతుల ప్రయోజనాల దృష్ట్యా డివిడెంట్లుగా అందజేసినట్లు తెలిపారు. సొసైటీ పరిధిలో ఉన్న 1153 మంది రైతులకు రూ.8లక్షల 8 వేలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీసీఈవో కోయ ఏసుప్రభు, సిబ్బంది కొప్పునేని వెంకటేశ్వరరావు, కొప్పర్తి ధనరాజు, గన్నాబత్తుల రాము, రైతులు ఖద్గం శెట్టి మాణిక్యాలరావు, వీర రాఘవులు, కోనప రెడ్డి నారాయణ, కొల్లాటి శివకృష్ణ పాల్గొన్నారు.

## ఉల్లాసంగా - ఉత్సాహంగా మహిళల రంగవల్లులు





**ముదినేపల్లి ,మేజర్ న్యూస్ :** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో మహిళలు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. మండలంలోని వడాలి గ్రామంలో కొలువైయున్న శ్రీ సుభద్ర బలరామ సహిత శ్రీ జగన్నాథస్వామి వారి దేవస్థానంలో రంగవల్లుల పోటీలు అందరిని అలరించాయి. రంగవల్లుల పోటీల్లో విజేతలుగా మొదటి బహుమతి గిడుతూరి వెంకటలక్ష్మి ,రెండవ బహుమతి మరీదు తేజశ్రీ ,మూడవ బహుమతి అగ్నిహోత్రం మన్విత పోటీలో పాల్గొన్న వారికి ప్రోత్సాహక బహుమతులు నియోజకవర్గ టిడిపి కన్వీనర్ వీరమల్లు నరసింహారావు , ఆలయ ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు అందజేశారు.ఈ రంగవల్లుల పోటీలలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తప్పిపోయిన చిన్నారులను 20 నిమిషాల్లో అప్పగించిన 2టౌన్ పోలీసులు



**ఏలూరు,మేజర్ న్యూస్:** ఏలూరు టూ టౌన్ పరిధిలోని తాపీ మేస్త్రి కాలనీ 7వ రోడ్డు లో తప్పి పోయిన చిన్నారులను 20 నిమిషాల్లో తల్లి దండ్రులు వద్ద కు చేర్చిన పోలీస్ సిబ్బంది.డయల్ 112 కాల్‌కు తక్షణమే స్పందించిన డీఎస్పీ ,సిబ్బంది ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు.ఏలూరు 2 టౌన్ పోలీసులు అత్యంత వేగంగా స్పందించి, తప్పిపోయిన ఇద్దరు చిన్నారులను కేవలం 20 నిమిషాల వ్యవధిలో రక్షించి వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. తాపీ మేస్త్రి కాలనీ 7వ రోడ్డులో నివాసం ఉంటున్న నరేష్ ,భార్గవి దంపతుల పిల్లలైన బండి హర్షిణి సహస్ర 3 సంవత్సరాలు, తేజీ శ్రీదోస్ 5 సంవత్సరాలు ఆడుకుంటూ బయటకు వెళ్లి మార్గం తప్పారు.పిల్లలు కనిపించక పోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు వెంటనే '112' అత్యవసర నంబర్‌కు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్,టూ టౌన్ సీఐ కె.అశోక్ కుమార్ అప్రమత్తమయ్యారు.తక్షణమే మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కాలనీ పరిసరాల్లో గాలింపు చేపట్టారు.గాలింపులో భాగంగా లంకపేట ఏరియాలో ఒంటరిగా ఉన్న చిన్నారులను పోలీసులు గుర్తించారు. ఆడుకుంటూ దారి తప్పి ప్రాంతానికి చేరుకున్నట్లు నిర్ధారించుకున్నారు.ఫోన్ చేసిన 20 నిమిషాల్లోనే చిన్నారులను సురక్షితంగా వారి ఇంటికి తీసుకువెళ్లి తల్లిదండ్రులకు అప్పగించారు.

తమ పిల్లలను ఇంత త్వరగా వెతికి పెట్టినందుకు బాధితులు నరేష్, భార్గవి కన్నీటి పర్యంతమవుతూ డీఎస్పీకి ,సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.పిల్లల పట్ల తల్లి దండ్రులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా ఆపద కలిగితే వెంటనే 112కి సమాచారం అందించాలని ఈ సందర్భంగా డీఎస్పీ శ్రావణ్ కుమార్ సూచించారు.

# దెందులూరు నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్క్





**– ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలి**
**: పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్**

**దెందులూరు,మేజర్‌న్యూస్ :** దెందులూరు నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు సంబందించిన ప్రతిపాదనలు వెంటనే రూపొందించి పంపాలని రాష్ట్ర పరిశ్రమలశాఖకార్యదర్శి డా.ఎన్.యువ రాజ్ జిల్లా అధికారులను ఆదేశించారు. దెందులూరు మండలం సోమవరప్పాడులో దెందులూరు నియోజకవర్గ ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు సంబందించి స్థల పరిశీలనను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, పరిశ్రమలు, రెవిన్యూ శాఖల అధికారులతో మంగళవారం సాయంత్రం డా. యువరాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశ్రమల శాఖ కార్యదర్శి డా.యువరాజ్ మాట్లాడుతూ సుమారు 250 ఎకరాల విస్తీర్ణంలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన భూములను గుర్తించాలని, రోడ్డు, రైల్, విమాన రవాణా సౌకర్యాలకు అనుగుణంగా ఉన్న భూములను గుర్తించినట్లయితే త్వరితగతిన పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి, ఆ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. జిల్లాలో చింతలపూడిలో ఎంఎస్ఎం ఈ పార్క్ ఏర్పాటు శంఖుస్థాపన జరిగిందని,పనులు వేగవంతం చేయాలన్నారు.జిల్లాలోని మిగిలిన అన్ని నియోజకవర్గాల లోనూ ఎంఎస్ఎంఈ పార్క్ ల ఏర్పాటుకు త్వరితగతిన ప్రతిపాదనలు రూపొందించి సమర్పించాలని డా.యువరాజ్ అధికారులను ఆదేశించారు. అనంతరం దెందులూరు గ్రామంలో ఏర్పాటుచేస్తున్న సాన్సో (ఝుఅంశీ) ఫార్మా పరిశ్రమ నిర్మాణాన్ని పరిశ్రమల శాఖ కార్యదర్శి డా.యువరాజ్ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి పరిశీలించి, పరిశ్రమ వివరాలను డా.యువరాజ్ పరిశ్రమ యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు.

కార్యదర్శి వెంట జిల్లా పరిశ్రమల శాఖాధికారి వెంకటరావు, జిల్లా పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ జోనల్ మేనేజర్ బాబ్జి, తహసీల్దార్ సుమతి , ప్రభృతులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వానికి మరో 20 ఏళ్లు ఎదురు లేదు,తిరుగులేదు





**– సంక్రాంతి అంటే కొందరు కోడి పందేలు,జూద పండగలా వక్రీకరిస్తున్నారు**
**– సంక్రాతి కానుకలు అందించిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్**

**పెదవేగి,మేజర్‌న్యూస్:** మండలంలోని దుగ్గిరాలలో సంక్రాంతి వేడుకల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ సంక్షేమాన్ని ప్రజలకు చేరువ చేస్తూ సేవలందిస్తున్న దెందులూరు నియోజకవర్గ పరిధిలోని 4మండలాల్లో పలు శాఖలకు చెందిన దాదాపు 2000 మంది ప్రభుత్వ సిబ్బందికి సంక్రాంతి కానుకలు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఏలూరు రూరల్ మండలంలోని మండల పరిషత్, సచివాలయాల సిబ్బందికి స్వయంగా సంక్రాంతి కానుకలు అందజేసి పండగ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలోనే రైతన్నలకు అసలు సిసలైన సంక్రాంతి అని అన్నారు.రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,యువ నాయకులు మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రం ముందడుగు వేస్తూ పయనిస్తుందని ఇందులో ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. నియోజకవర్గంలో గడచిన ఏడాది కాలంలో కుటుంబ సభ్యుడిని కోల్పోయి పండగలకు దూరంగా ఉన్న దాదాపు 4వేల మంది కుటుంబాలను గుర్తించి వారికి పండగల సందర్భంగా చింతమనేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వయంగా వారందరి కోసం పిండి వంటలను తయారు చేయించి ఒక్కొక్కరికి కేజీ అరిసెలు అరకిలో చెక్కలను కిట్ రూపంలో రూపొందించి అందించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు బొప్పన సుధా, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉప్పలపాటి రాంప్రసాద్,సీనియర్ నాయకులు పెదవేగి సొసైటీ ఛైర్మన్ తాతా సత్యనారాయణ, ఏలూరు రూరల్ మండల పార్టీ అధ్యక్షులు నంబూరి నాగరాజు, క్లస్టర్ ఇంచార్జ్ నేతల రవి, పెదవేగి మండల పార్టీ అధ్యక్షులు ఈడ్పుగంటి అనిల్,జనసేన నాయకులు జాలిపూడి సొసైటీ చైర్మన్ మోటేపల్లి పవన్ , ఏలూరు రూరల్ మండల తాసిల్దార్ విజయ్ కుమార్, సహా పలువురు ఎండిఓ లు వివిధ శాఖల అధికారుల సిబ్బంది పాల్గొన్నారు..

# కారుమూరి నువ్వు నేర్పిన సంస్కృతి ఇదే




**– పవన్, చంద్రబాబుల ఫ్లెక్సీలను వ్యగ్యంగా చిత్రీకరించింది ఎవరు..?**
**– మాజీ మంత్రి కారుమూరిపై ఎమ్మెల్యే రాధాకృష్ణ ఆగ్రహం**

**తణుకు,మేజర్‌న్యూస్ :** వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అధికార మదంతో ఆనాడు చంద్రబాబు అడ్డుకోవడానికి ప్రయత్నించి... అమరావతి రైతులు వచ్చినప్పుడు వారి పర్యటనలో నల్ల బెలూన్స్‌తో నిరసన తెలియజేసి. చంద్రబాబు ఫోటోపై నల్ల మార్కులు వేసిన వైసీపీ నేతలు చెప్పుతో కొట్టిన సందర్భాలు గుర్తు లేవా అంటూ మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావుపై ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అప్పుడు మీరు చేస్తే నీతి ఇప్పుడు మేం చేస్తే తప్పుగా కనబడుతోందా అంటూ మండి పడ్డారు. మంగళవారం కూటమి కార్యాయలంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్ష నాయకుడు హోదాలో తణుకు విచ్చేసిన చంద్రబాబు నాయుడును అడ్డుకున్న వైసీపీ నాయకులు కాదా అని ప్రశ్నించారు. రైతుపోరుబాట యాత్రకు వచ్చిన సమయంలో ఇరగవరం నుంచి తణుకు వరకు గోబ్యాక్ అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయలేదా అని ప్రశ్నించారు. అత్తిలి మండలం ఉరదాళ్లపాలెం గ్రామంలో స్థానికులు ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తే మాజీ మంత్రి కారుమూరి ముసలి కన్నీరు కార్చుతున్నారని అన్నారు. అప్పుడు మీరు చేస్తే న్యాయం. ఇప్పుడు మేం చేస్తే అన్యాయమా అని అన్నారు. 2019 నుంచి ఇప్పటి వరకు ఎంత మంది కార్యకర్తలు, నాయకులు,బీసీలను వాడుకుని వదిలేశారో తెలుసుకోవాలన్నారు. ఉరదాళ్లపాలెం గ్రామాన్ని దత్తత తీసుకున్నానని చెప్పిన మాజీ మంత్రి కారుమూరి గ్రామాన్ని పూర్తి స్థాయిలో నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ప్రతిపక్షంలో కారుమూరి చేసిన అవమానాలు కారణంగానే కూటమి నాయకులు ఇప్పుడు మాట్లాడాల్సి వస్తోందన్నారు. గత అయిదేళ్లలో కారుమూరి చేసిన దురాగతాలు, అరాచరాలు ఇంకా గుర్తు ఉన్నాయి. ఇంకా ఉన్న మూడేళ్లలో వడ్డీతో సహా చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. నియోజకర్గంలో అభివృద్ధి, సంక్షేమాన్ని అమలు చేస్తున్నామని ప్రతిపక్ష హోదాలో తోక జాడిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కారుమూరి చేసిన వ్యాఖ్యలు, చంద్రబాబును అడ్డుకున్న తీరును వీడియోల రూపంలో ప్రదర్శించి చూపారు.

# సెయింట్ జోసెఫ్ దంత కళాశాలలో సంక్రాంతి సంబరాలు



**పెదవేగి,మేజర్ న్యూస్ :** సెయిట్ జోసెఫ్ దంత కళాశాలలో మంగళ వారం సంక్రాంతి సంబ రాలు ఘనంగా నిర్వహిం చారు. దంత కళాశాల, నర్సింగ్ కళాశాల అధ్యాపకులు విద్యార్థులు ఎంత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమం కళాశాల చైర్మన్,ఏలూరు పీఠాధిపతులు బిషప్ జయ రావు పొలిమేర సహకారంతో నిర్వహించారు. ముందుగా ఉదయం 5 గంటలకు భోగి మంటను కళాశాల కరస్పాండెంట్,సెక్రెటరీ ఫాదర్ జి మోజెస్, ప్రిన్సిపాల్ ఎన్ స్లీవరాజు,ఆర్గనైజేషన్ సెక్రటరీ ,ప్రోస్తో డిపార్ట్మెంట్ హెచ్‌వై డి డాక్టర్ సీతారాం ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో సంక్రాంతికి సంబంధించిన ముగ్గుల పోటీలు,గంగిరెద్దులు ,రోకలి, కుంది, ఎడ్లబండి,పశువుల పాక,కోడి పందాలు, డాన్స్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఫెలిక్స్ నర్సింగ్ కళాశాల కంస్పాండెంట్ ఫాదర్ పి జాకప్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ఉష దంత కళాశాల,నర్సింగ్ కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

### మాజీ మంత్రులు బొత్స,రంగనాథరాజుతో వడ్డీ రఘురాం భేటీ



**తాడేపల్లిగూడెం ,మేజర్‌న్యూస్;** వైఎస్ ఆర్సిపి తాడేపల్లి గూడెం నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డీ రఘురాం నాయుడు పలువురు వైయస్సార్సీపి ముఖ్య నాయకులను మర్యాదపూర్వకంగా కలిశారు. విజయ నగరంలో శాసనమండలి ప్రతిపక్ష నేత, వైస్సార్సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణని వైస్సార్సీపీ ఇంచార్జ్ వడ్డి రఘురామ్ నాయుడు వారి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ పార్టీ పరిస్థితులపై చర్చించారు. మాజీ మంత్రి పేరుని నానిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిగూడెం లో మాజీ గృహ నిర్మాణ శాఖ మంత్రి చెరుకువాడ రంగనాథరాజు ని వారి స్వగృహంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గం వైస్సార్సీపీ ఇంచార్జ్ వడ్డి రఘురామ్ నాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మాజీ కొప్పులవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాస్, వైసీపీ నాయకులు మాకరాజు సతీష్, కలిశెట్టి తాతారావు, కొండుబోయిన కృపావరం తదితరులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ సిఐ ఆధ్వర్యంలో తనిఖీలు




**నరసాపురం,మేజర్‌న్యూస్ :** పండుగ సమయాల్లో జిల్లాలో అక్రమ మద్యం రాకుండా గట్టి నిఘా పెట్టామని ఎక్సైజ్ సీఐ ఎస్. రాంబాబు తెలిపారు.మంగళవారం నరసాపురం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోనిచించినాడ, సీతారాంపురం గ్రామాల్లో రెండు చెక్ పోస్టులలో సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు . 24 గంటలు ఈ చెక్ పోస్ట్ లలో నిఘా కొనసాగుతుందన్నారు. వాహనాల్లో ఇతర రాష్ట్రాల,విదేశాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుండి ఎపికి మద్యం తీసుకుని రావడం నేరమన్నారు. ఇతర ప్రాంతాల నుండి మద్యం తీసుకొని వస్తే కేసులు నమోదు చేసి, వాహానాన్ని సీజ్ చేస్తామన్నారు. ఇతర రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల, విదేశాల నుండి నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం తీసుకోస్తే నాన్ బెయిల్ బుల్ సెక్షన్లు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# ఏలూరు ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలి





**– అమ్మవారి జాతరలో తపన చౌదరి దంపతుల ప్రత్యేక పూజలు**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఏలూరులోని దక్షిణపు వీధి మరియు పడమర వీధిలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న శ్రీ గంగానమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని, మంగళవారం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి (తపన చౌదరి), రేణుక దంపతులు అమ్మవార్లను దర్శించుకున్నారు. మేడల్లో కొలువుదీరిన శ్రీ గంగానమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ వినుకొండ అంకమ్మ, శ్రీ పోతురాజు బాబులకు వారు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గారపాటి చౌదరి మాట్లాడుతూ శ్రీ గంగానమ్మ అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ ముఖ్యంగా ఏలూరు నగర ప్రజలు ఆయురా రోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పురాతన కాలం నుండి వస్తున్న ఇటువంటి జాతరలు మన సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడటమే కాకుండా ప్రజల మధ్య ఐక్యతను పెంచుతాయని ఆయన పేర్కొన్నారు. నగరంలోని రెండు ప్రధాన వీధుల కమిటీ సభ్యులుఎంతో నిష్టతో, క్రమశిక్షణతో ఈ జాతర మహోత్సవాలను నిర్వహించడం అభినందనీయమని ఆయన కొనియాడారు. ఐక్యమత్యంతో ఈ ఉత్సవాన్ని ఇంతటి ఘనంగా నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పడమర వీధి జాతర కమిటీ అధ్యక్షులు చోడే బాలసుబ్రహ్మణ్యం (బాలు), కార్పొరేటర్ కర్రి శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ కరణం గణేష్, దక్షిణపు వీధి జాతర కమిటీ గౌరవ అధ్యక్షులు చలువాది బ్రహ్మయ్య,అధ్యక్షులు అద్దేపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. వీరితో పాటు జాతర కమిటీ సభ్యులు నగిరెడ్డి కాశీ నరేష్, పండు నాయుడు,అగ్గాల గాయత్రీ సుబ్రహ్మణ్యం, జనసేన నాయకులు కూనిశెట్టి మురళీకృష్ణ, బోండా రాము నాయుడు,పైడి లక్ష్మణరావు, నూకల సాయి,కూటమి పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రూ.679 కోట్లతో పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తులు





**– పారిశ్రామికవేత్తల సమస్యలను విసి ద్వారా అడిగి తెలుసుకున్న కలెక్టర్**
**– జిల్లా కలెక్టర్ నేరుగా పారిశ్రామికవేత్తలతో మాట్లాడడం,నూతన ఒరవడి**
**– శ్రీ వెంకటేశ్వర బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఏలూరు జిల్లాలో 679 కోట్ల రూపాయలతో 7 పరిశ్రమల ఏర్పాటు కోసం దరఖాస్తులు అందగా, పరిశ్రమ ఏర్పాటులో వారి సమస్యలను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా స్వయంగా అడిగి తెలుసుకున్నారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో మంగళవారం జరిగిన జిల్లా పారిశ్రామిక, ఎగుమతి ప్రోత్సాహక మండలి సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుతో జిల్లా అభివృద్ధితో పాటు స్థానిక యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని అధికారులు ఈ దిశగా ఆలోచించి పరిశ్రమల ఏర్పాటుకు త్వరితగతిన అనుమతులు జారీ చేయాలనీ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సింగల్ డెస్క్ విధానం ద్వారా జిల్లాలో 793 చిన్న, మధ్య, పెద్దతరహా పరిశ్రమలకు అనుమతులు జారీ చేసినట్లు కలెక్టర్ చెప్పారు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి పాలసీలో ఎంఎస్ఎంఈ యూనిట్లు ఏర్పాటుచేసిన పారిశ్రామిక వేత్తలకు ఇన్వెస్ట్మెంట్, విద్యుత్, వడ్డీ, స్టాంప్ డ్యూటీ రాయితీల కింద 25 యూనిట్లకు 96.4 లక్షల రూపాయలు మంజూరు చేస్తూ సమావేశం తీర్మానించింది.

ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సమస్యలను జిల్లా కలెక్టర్ నేరుగా అడిగి తెలుసుకోవడం కొత్త విధానమని, జిల్లా యంత్రాంగం తీసుకున్న ఈ వినూత్న విధానం ద్వారా జిల్లాలో పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు ఏర్పాటుచేసేందుకు మరింత ముందుకు వచ్చే అవకాశం ఉందని తన ఆనందాన్ని తెలియజేసారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ వెంకటరావు,ఐటిడిఏ పీఓ రాములు నాయక్,జిల్లా పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ జోనల్ మేనేజర్ బాబ్జి,డిఆర్డిఏ పీడీ విజయరాజు, వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులు హబీబ్ భాషా,షాజా నాయక్, ఎల్డిఎం నీలాద్రి, డిపిఓ అనురాధ, ప్రభృతులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఎంపీ పుట్టా మహేష్ సంక్రాంతి శుభాకాంక్షలు



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఏలూరు పార్లమెంటు ప్రజ లకు సంక్రాంతి శుభాకా ంక్షలు తెలిపారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. గత పది రోజులుగా పార్ల మెంటు పరిదిలోని అనేక గ్రామాల్లో పర్యటిస్తూ సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు ఎంపీ. ముగ్గుల పోటీలు, ఎడ్ల పందాలు, ఆటల పోటీలు, పశు ప్రదర్శనలు, భోగిమంటలుతో సహా అనేక కార్యక్రమాల్లో స్థానిక నేతలతో కలిసి ఎంపీ ఉత్సా హంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏలూరులోని తన నివాసం వద్ద మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఈ సంక్రాంతి పండుగను ప్రజలంతా తమ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులందరితో ఆనందోత్సాహాలతో జరుపు కోవాలని కోరుకుం టూ, ఏలూరు పార్లమెంట్ ప్రజలతో పాటు, రాష్ట్ర ప్రజలందరికీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేశారు.

# మంత్రి కొలుసు పార్థసారథి ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు



**నూజివీడు,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రజలకు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సంద ర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదా యాలను ప్రతిబింబించే పండుగ సంక్రాంతి అని అన్నారు. తమ స్వగ్రామాలకు తిరిగి వెళ్ళి, తమ కుటుంబ, సాంస్కృతిక మూలాలకు విలువనిచ్చే పెద్ద పండుగ సంక్రాంతి అని, భోగి మంటలు, రంగ వల్లులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దులు ఆటలు, గాలి పటాల సందళ్ళు, రైతు లోగిళ్ళలో ధాన్యం రాసులు, పిండి వంటలు, బంధు మిత్రుల సందళ్ళతో కనువిందు చేసే మనందరి పండుగ సంక్రాంతి అన్నారు. వ్యవసాయ ప్రధానమైన మనదేశంలో పంటలు చేతికి వచ్చే కాలం ఇది అని, సంపదను, ఆనందాన్ని కుటుంబంతో, సమాజంతో పంచుకుని సంతోషించే వేడుక సంక్రాంతి అన్నారు. పాడి పంటలు సమృద్ధిగా ఇళ్లకు వచ్చే కాలం కావడంతో భోగి అంటే భోగ భాగ్యాలను అనుభవించే రోజుగా ఉంటుందన్నారు. పాతకు స్వస్తి చెప్పి నూతనత్వానికి స్వాగతం పలుకుతూ ప్రతి ఇంటి ముందు భోగి మంటలు, రంగవల్లుల శోభతో దివ్యత్వం, కళా నైపుణ్యం గోచరిస్తాయాన్నారు. స్నానం, దానం, పితృతర్పణం, దేవతలను పూజించడం వంటివి సంక్రాంతి పండుగలో భాగంగా ఉంటాయన్నారు. సంక్రాంతి పండుగతో రాష్ట్రంలో ప్రతి ఇంటిలో సిరులు వెల్లివిరియాలని మంత్రి కొలుసు పార్థసారథి ఆకాంక్షించారు.

## జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు : జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** మహా సంక్రాంతి సందర్భంగా ఏలూరు జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి శుభాకాంక్షలు తెలియజేసారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలు తెలియజేసే పల్లెల పండుగ, రైతులు పండుగగా సంక్రాంతి నిలుస్తుందన్నారు. బంధు మిత్రులు అందరిని కలుసుకుని కనువిందులు చేసే అందరి పండుగ సంక్రాంతి అన్నారు. రైతులకు పంటలు చేతికి వచ్చే కాలం అని, ఆనందాన్ని కుటుంబంతో పంచుకుని సంతోషించే వేడుక సంక్రాంతి అన్నారు. సంక్రాంతి పండుగతో జిల్లాలోని ప్రతి ఇంటిలో సిరులు వెల్లివిరియాలని,అభివృద్ధి,సంక్షేమంలో రాష్ట్రంలో ఏలూరు జిల్లాను ఆదర్శంగా నిలిచేలా సమిష్టి కృషిచేద్దామని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు.

## ప.గో.జిల్లా ప్రజలకు కలెక్టర్ నాగరాణి సంక్రాంతి శుభాకాంక్షలు



**భీమవరం, మేజర్ న్యూస్ :** మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగ సంక్రాంతి అని, ఇది పల్లెల పండుగ, రైతుల పండుగ, మన పాడిపంటల పండుగగా సంక్రాంతి నిలుస్తుందన్నారు. తమ తమ స్వగ్రామాలకు తిరిగి వెళ్ళి, తమ కుటుంబ, సాంస్కృతిక మూలాలకు విలువనిచ్చే పెద్ద పండుగ సంక్రాంతి అని,భోగి మంటలు, రంగ వల్లులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, గాలి పటాల సందళ్ళు, రైతు లోగిళ్ళలో ధాన్యం రాసులు, పిండి వంటలు, బంధు మిత్రుల సందళ్ళతో కనువిందు చేసే మనందరి పండుగ సంక్రాంతి అన్నారు. వ్యవసాయ ప్రధానమైన మనదేశంలో పంటలు చేతికి వచ్చే కాలం ఇది అని, సంపదను, ఆనందాన్ని కుటుంబంతో, సమాజంతో పంచుకుని సంతోషించే వేడుక సంక్రాంతి అన్నారు. పాడి పంటలు సమృద్ధిగా ఇళ్లకు వచ్చే కాలం కావడంతో భోగి అంటే భోగ భాగ్యాలను అనుభవించే రోజుగా ఉంటుందన్నారు.